క్లుప్తంగా

బీజేపీ నూతన బూత్ కమిటీ ఏర్పాటు


బీజేపీ నూతన బూత్ కమిటీ సభ్యులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని బూరుగడ్డలో బీజేపీ నూతన బూత్‌కమిటీని ఏర్పాటు చేసినట్లు మండల అధ్యక్షుడు రాకేశ్, మండల కార్యదర్శి శేఖులు శనివారం తెలిపారు. బూత్ అధ్యక్షుడిగా గొల్ల పాపయ్య, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌తో పాటు గణేశ్, భిక్షపతి, ప్రేందాస్, దశరథ్, రాజు, రేణుక, పోచయ్య, మల్లేశ్, శ్రీకాంత్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, మల్లేశ్, ప్రశాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించండి


నిరసన తెలుపుతున్న గ్రామ పంచాయతీ కార్మికులు

మనోహరాబాద్(తూప్రాన్): పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించడం లేదని శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి మనోహరాబాద్ గ్రామ పంచాయతీ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల జిల్లా కార్యదర్శి ఆసిఫ్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నిరసనలు చెపట్టినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం 51 జీఓని సవరించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ఈ నెల 11న ఎమ్మెల్యే నివాసల వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సన్మానం


నర్సులను సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు

మెదక్: మెదక్‌లోని ఎంసీహెచ్ ఆస్పత్రిలో శనివారం నర్సులను సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా సాత్విక్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షురాలు శ్రీలత, వైద్యులు పీసీ శేఖర్‌తో పాటు నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి రోడ్డు ధ్వంసం


తొలగించిన మట్టిరోడ్డుని చూపుతున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): పొలాల్లోకి వెళ్లే మట్టి రోడ్డుని ధ్వంసం చేశారని రైతులు వాపోయారు. మండల పరిధిలోని పాంబండ గ్రామ పరిధిలోని పొలాల్లోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మట్టి రోడ్డుని రియల్ ఎస్టేట్ వ్యాపారులు తొలగించడంపై శనివారం రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ ఉపాధిహామీ పథకంలో మట్టిరోడ్డు వేశామన్నారు. ఉన్నత అధికారులు స్పందించి ఆ రోడ్డుని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

ఆలయ నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని ధర్నా


గిరిజనులతో మాట్లాడుతున్న పోలీసులు

చేగుంట(తూప్రాన్): గుడి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని గిరిజనులు చేగుంట శివారులోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మండల కేంద్రం చేగుంట గెస్ట్‌హౌస్ సమీపంలో కొన్నేళ్లుగా గిరిజనులు జెండాలను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. ఇటీవల అక్కడ దుర్గామాత, సేవాలాల్ చిత్రపటాలను ఏర్పాటు చేసి, ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. గుడికి అనుమతి లేదని శనివారం రెవెన్యూ అధికారులు చిత్రపటాలను గ్రామ పంచాయతీకి తరలించారు. దీంతో పలు గ్రామాల గిరిజనులు జాతీయ రహదారిపై రస్తారోకో చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం ఇప్పించేందుకు సహకరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.


చిలప్‌చెడ్(నర్సాపూర్): చండూర్‌లో శివపార్వతుల కల్యాణం


కొల్చారం(నర్సాపూర్): శివపార్వతుల కల్యాణోత్సవం

కల్యాణం.. కమనీయం


మనోహరాబాద్(తూప్రాన్): పాలాటలో రథాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు


మహ్మద్‌నగర్‌లో బండ్ల ఊరేగింపు


చిలప్‌చెడ్(నర్సాపూర్): చండూర్‌లో..


శివ్వంపేటలో..


నార్సింగి మల్లన్న జాతరలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి వారి శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు మురళీధర శర్మ మాట్లాడుతూ.. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివపార్వతుల కళ్యాణోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా జరిపించారన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉపవాస దీక్షల విరమణ, స్వామి వారికి అభిషేకాలు నిర్వహించామన్నారు.

చెల్మనాయగుట్టలో..

మనోహరాబాద్(తూప్రాన్): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామ శివారులోని రాజరాజేశ్వరి దేవాలయంలో అమ్మవారి కల్యాణం వైభవంగా జరిగింది. పండితులు వెంకటేశ్వర శర్మ, ఆలయ ధర్మకర్త పెంటాగౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ సుగుణ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. పాలాటలో రథం ఊరేగించారు. చెట్లగౌరారం లోని చెల్మనాయగుట్టలో స్వామికి తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, అశోక్‌యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు.

రంగంపేట సంగమేశ్వర ఆలయంలో ..

కొల్చారం(నర్సాపూర్): మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా మండలంలోని రంగంపేట సంగమేశ్వర ఆలయంలో శనివారం శివపార్వతుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన వ్యాపారులు మాలె రమేశ్, వెంకటేశం కుటుంబ సభ్యులు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ..

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలోని ఉమామహేశ్వరస్వామి, గోమారంలోని రామలింగేశ్వర ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ, పురోహితుడు అయోధ్య రామశర్మ , జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు పబ్బ రమేశ్‌గుప్తా, శ్రీనివాస్‌గౌడ్, యాదగౌడ్, మాధవరెడ్డి, జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.

శివ్వంపేటలో..

మండల కేంద్రం శివ్వంపేటలో దుర్గమ్మ జాతర గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో చేశారు. అందులో భాగంగా దుర్గమ్మకు బండ్లు, బోనాల ఊరేగించారు.

చండూర్‌లో బండ్ల ఊరేగింపు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చండూర్ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద రెండో రోజు జాతర కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఎడ్ల బండ్లను అందంగా అలకరించి గ్రామం చుట్టూ ఊరేగించారు. కార్యక్రమంలో యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

నార్సింగిలో మల్లన్న జాతర

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో మల్లన్న జాతర వైభవంగా జరిగింది. శనివారం ఈ సందర్భంగా మల్లన్న కల్యాణోత్సవం నిర్వహించారు. దుబ్బాక నియోజవర్గ కాంగ్రెస్ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి హాజరై మల్లన్నకు పూజలు నిర్వహించారు. అనంతరం ఎడ్లబండ్లను ఊరేగించారు. అగ్నిగుండాల్లో భక్తులు నడిచారు.

మహ్మద్‌నగర్‌లో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహ్మద్‌నగర్‌లో దుర్గాదేవి జాతర భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుగుతోంది. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామస్తులు బండ్లు, ట్రాక్టర్లను ఊరేగించారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రఘు, వెంకన్న, , ధన్‌సింగ్, వెంకట్‌గౌడ్, కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీస్ కవాతు


మాసాయిపేటలో కవాతు చేస్తున్న పోలీసులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలో శనివారం పారా మిలటరీ బలగాలు, చేగుంట పోలీసులు కవాతు నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం నుంచి మొదలుకొని గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలనే సదుద్దేశంతో ఎస్పీ ఆదేశాల మేరకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించినట్లు చేగుంట ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా, భయబ్రాంతులకు లోనుకాకుండా, శాంతియుత వాతావరణంలో తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు.

చేగుంటలో..

చేగుంట(తూప్రాన్): పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం సీఆర్పీఎఫ్ బలగాలు చేగుంటలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ బాలరాజు మాట్లాడుతూ.. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఆర్పీఫ్ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కవాతు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో చేగుంట పోలీస్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.


చేగుంటలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు సీఆర్పీఎఫ్ జవాన్లు

దాబాలో గోమాంసం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని జీడిపల్లి శివారులోని ఓ దాబాలో శనివారం గోమాంసం వండుతున్నారని స్థానికులు దాబా వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో దాబాలో గోమాంసం ఎలా వండుతారని దాబా నిర్వాహకులతో గొడవ పడ్డారు. ఈ విషయమై ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డిని వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని అన్నారు. అప్పటి వరకు ఎలాంటి ఆందోళన చేయొద్దని వారికి నచ్చచెప్పారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో అక్రమాలకు పాల్పడిన రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటూ సీఎంఆర్ రికవరీ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి లింగపల్లి శ్రీనివాస్ మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మెదక్‌లో ఆయన మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందించే సీఎంఆర్ రైస్‌ను మిల్లర్లు పక్కదారి పట్టించారని ఆరోపించారు. అలాగే ఈనెల 14వ తేదీన మెదక్ పార్లమెంటరీ స్థాయి ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమానికి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు యాదగిరి, మురళి, బాలరాజ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వాటర్ పాకెట్ల పంపిణీ



పాపన్నపేట(మెదక్): ఏడుపాయల జాతరలో భారతీ సిమెంట్ ఆధ్వర్యంలో భక్తులకు వాటర్ పాకెట్లను పంపిణీ చేశారు. అలాగే ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా పోలీసులకు బారికేడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చీఫ్ మార్కెటింగ్ మేనేజర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. సిమెంట్ రంగంలో ఎదురులేని భారతీ సిమెంట్ సామాజిక సేవలో కూడా పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శ్రీకాంత్, మేనేజర్ అడ్మిన్ సునీల్, టెక్నికల్ సర్వీసెస్ రాజు, డీలర్ లింగమూర్తి పాల్గొన్నారు.

◆ రీజినల్ ఫాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గం

రామాయంపేట(మెదక్): పట్టణంలో శనివారం రిజినల్ ఫాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా అకుల, ఉపాధ్యక్షుడిగా జోయాజ్, ప్రధాన కార్యదర్శిగా థామస్, సహాయ కార్యదర్శిగా ఆశీర్వాదం, కోశాధికారిగా రత్నంను ఎన్నుకున్నారు. సభ్యులుగా రాజు, దేవదానం ఎన్నికయ్యారు. బిషప్ దాస్ ఎల్లం, సత్యానందం, రూబేన్, సంజీవరావు, పలు మండలాల ఫాస్టర్లు పాల్గొన్నారు.

◆ పండ్ల పంపిణీ

నర్సాపూర్: పట్టణంలోని బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీలో మొదటి సంవత్సరం చదివే సాయి ఈశ్వర్ ఆదివారం తన పుట్టినరోజును పురస్కరించుకొని విజన్ ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు,



బిస్కెట్లు పంపిణీ చేశారు. దీంతో పలువురు వ్యక్తులు సాయిఈశ్వర్‌ను అభినందించారు.

◆ శ్రీనివాసుడి కల్యాణం

దుబ్బాకటౌన్: తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన దుబ్బాకలోని బాలాజీ ఆలయంలో శనివారం పద్మావతి, శ్రీనివాసుడి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారి కల్యాణం తిలకించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఘనంగా దుర్గమ్మ ఉత్సవాలు


బోనాల ఊరేగింపులో గ్రామస్తులు


దుర్గమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్ రూరల్: మండలంలోని పెద్దచింతకుంటలో దుర్గమ్మ జాతర ఘనంగా జరుగుతోంది. ఈ ఉత్సవాలకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారికి భక్తులు ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం బండ్లు, బోనాలను ఊరేగించగా శివసత్తులు, యువకులు నృత్యం చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శివకుమార్, బాలరాజ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా కొప్పోల్ జాతర


రాంపూర్‌లో గండదీపాలను ఊరేగిస్తున్న భక్తులు


ఎడ్లబండ్ల ఊరేగింపు


కొప్పోల్ జాతరకు తరలివచ్చిన భక్తులు


చిన్నశంకరంపేట(మెదక్): సోమేశ్వరాలయం ఆలయం వద్ద భక్తులు

ఆకట్టుకున్న ఎడ్లబండ్ల ఊరేగింపు

పెద్దశంకరంపేట(మెదక్): మహాశివరాత్రిని పురస్కరించుకొని మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయంలో ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఆలయంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. అలాగే ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండ్లను యువకుల నృత్యాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఘనంగా ఊరేగించారు. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ఎస్ఐ.శంకర్‌ల ఆధ్వర్యంలో జాతరలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

గండదీపాల ఊరేగింపు

చేగుంట(తూప్రాన్): మండలంలోని రాంపూర్ అగ్రహారం శివాలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గండదీపాలను ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేకంగా అలంకరించిన గండదీపాలను డప్పుచప్పుళ్లతో ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సోమేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని సోమేశ్వరాలయం బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. సాయంత్రం ఎడ్ల బండ్లను సోమేశ్వర, వినాయక, వీరభద్ర, హనుమాన్ ఆలయాల చుట్టూ ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, శ్రీమాన్‌రెడ్డి, రామకిష్టయ్య, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేయండి


మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్‌డీవై కాలనీ వాసులు

మెదక్ మున్సిపాలిటీ: తమ కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని పట్టణంలోని జంబికుంట ఎస్‌డీవై కాలనీ వాసులు మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్ డీవై కాలనీ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు కమిటీ సభ్యులు చైర్మన్‌ను కలిసి పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. త్వరగా పనులు చేపట్టి పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సంపత్, ఉపాధ్యక్షులు రాజయ్య, నవీన్‌గౌడ్, గోపాల్, కోశాధికారి భూపతి గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, కమిటీ సభ్యులు సంతోష్, మురళి ,శ్రీనివాస్, వినయ్, బేతయ్య, రమేశ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలు


వైద్యపరీక్షలు చేస్తున్న ఏఎన్ఎం శిరోమణి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని దేవులపల్లి కోమటికుంట తండా అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం వైద్యసిబ్బంది గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలను వైద్యపరీక్షలు నిర్వహించారు. ఏఎన్ఎం శిరోమణి లబ్ధిదారులకు వైద్యపరీక్షలు చేసి, అవసరం ఉన్నవారికి రోగనిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలు రక్తహీనత నివారించేందుకు ఆకుకూరలు, పాలు కోడి గుడ్లు ఎక్కువగా తినాలని చెప్పారు. గర్భిణులు ప్రతీ నెల వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అనురాధ ,లబ్ధిదారులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు పూర్తి


పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: మున్సిపాలిటీలోని 9వ వార్డులో తాగు నీటి పైపులైన్ లీకేజీకి మున్సిపల్ సిబ్బంది శనివారం మరమ్మతులను నిర్వహించగా, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ ఆ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని, పనులను పకడ్బందీగా చేయాలని సిబ్బందికి చెప్పారు. అలాగే గుంతలు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ వర్క్ ఇన్స్‌పెక్టర్లు భూపాల్, వినీత్ ఉన్నారు.